ప్రజాశక్తి
మంగళవారం 23 జనవరి 2024
5
పార్వతీపురం మన్యం

ఓటరు దినోత్సవంపై చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి -పార్వతీపురం

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఈనెల 25న జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్‌డిఒ కె.హేమలత తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. "ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యత" అన్న అంశంపై జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఈ పోటీలు ఈనెల 25న ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు జిల్లా కలెక్టరు కార్యాలయ ప్రాంగణంలో జరుగుతుందని అన్నారు. పోటీల్లో పాఠశాల, కళాశాల విద్యార్థులు, ఆసక్తిగల పౌరులు పాల్గొనవచ్చని తెలిపారు. చిత్రలేఖన పోటీలకు సంబంధించి కాన్వాస్ పేపర్‌ను సరఫరా చేస్తున్నామని,ఇతర సామగ్రిని పోటీలో పాల్గొంటున్న విద్యార్థులు, అభ్యర్థులు తీసుకురావాలని ఆమె స్పష్టం చేశారు.

నిర్బంధాలు, అరెస్టులపై అంగన్వాడీల ఆగ్రహం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

అంగన్వాడీలపై జిల్లా కలెక్టర్, జిల్లా అధికార యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు సరైంది కాదని, ఈ దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం, ఐక్య వామపక్ష పార్టీల నాయకులు అన్నారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం -విశాఖపట్నం రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జెసి ఆర్.గోవిందరావును కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కార్మికులు 42 రోజులుగా చట్టబద్ధమైన సమ్మె చేస్తున్నారన్నారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, ప్రధానమైన వేతనాల పెంపునకు ప్రభుత్వం ఆమోదించాలని కోరారు. శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై ఒత్తిడి చేయడం ప్రభుత్వానికి భావ్యం కాదన్నారు. వెంటనే తమరు జోక్యం చేసుకొని వారి న్యాయబద్ధమైన, చట్టబద్ధమైన డిమాండ్లు పరిష్కరించి, వారిపై నిర్బంధం ఆపి రాష్ట్ర ప్రభుత్వం చర్చలు పిలిచి సమ్మె సమస్య పరిష్కరించాలని కోరారు. అంగన్వాడీలు న్యాయంగా, చట్టబద్దంగా సమ్మె నిర్వహిస్తున్నారని, నిబంధనల ప్రకారం 14 రోజులు ముందుగా సమ్మె నోటీస్ ఇచ్చిన తర్వాతే సమ్మె ప్రారంభమైందని తెలిపారు. అధికారులు ఇచ్చిన షోకాజ్ నోటీసులకు అంగన్వాడీలు వివరణ కూడా ఇచ్చారన్నారు. న్యాయంగా, చట్ట బద్దంగా దీనిపై బహిరంగ విచారణకు ప్రభుత్వం పూనుకోవాలని, అలా చేయకుండా తొలగింపు ఉత్తర్వులు ఇవ్వడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. కావున అంగన్వాడీలపై నిర్బంధం, తొలగింపు ఉత్తర్వులు ప్రభుత్వం ఆపాలని డిమాండ్ చేశారు. కావున వెంటనే బెదిరింపుల ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని, వారితో చర్చించే న్యాయమైన వారి సమస్యలు పరిష్కరించాలని, లేనిచో ఆందోళన తీవ్రతరం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిపిఐ, సిపిఎంఎల్, సిపిఎం ఎండి వామపక్ష, ప్రజా సంఘాలు నాయకులు బి.నర్సింగరావు, పి.భాస్కర రావు, పి.సంఘం, ఎన్ఎం నాయుడు, సిఐటియు నాయకులు వై.మన్మధరావు, జి.వెంకటరమణ, బివి రమణ, కె.రామస్వామి, బలరాం, బంటు దాసు, పాకల సన్యాసిరావు తదితర సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో రాస్తారోకో చేస్తున్న సిపిఎం, వామపక్ష నాయకులు

సాలూరు: న్యాయమైన డిమాండ్లు ఆమోదించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె లో భాగంగా చలో విజయవాడ కార్యక్రమం పై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాన్ని ఖండిస్తూ పట్టణ సిపిఎం నాయకులు సోమవారం జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. సిపిఎం పట్టణ నాయకులు రాముడు, శంకరరావు ఆధ్వర్యాన కార్యకర్తలు ప్రభుత్వ తీరును ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల పట్ల మొదటి నుంచి అణిచివేత ధోరణి అవలంభిస్తోందని చెప్పారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను వైసిపి ప్రభుత్వం హరిస్తోందన్నారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు పోలరాజు, రామారావు పాల్గొన్నారు.

నిరాహార దీక్షా శిబిరంపై పోలీసుల నిరంకుశ దాడిని, అక్రమ అరెస్టులకు ఖండన

పార్వతీపురం టౌన్ : సిఐటియు, ఎఐటియుసి, ఇఫ్టూ అనుబంధ అంగన్వాడీ సంఘాల అధ్వర్యంలో 41 రోజులుగా శాంతియుతంగా రాష్ట్రంలో సమ్మె సాగుతుందని, ఐదురోజులుగా నిరవధిక నిరాహార దీక్ష సాగుతున్నాయని, విజయవాడలో జరుగుతున్న ఈ శిబిరంపై పోలీసులు నిరంకుశంగా దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్టు ఇఫ్టూ, ఎఐకెఎంఎస్, పిడబ్ల్యుయు, ఎఐటిఎఫ్ జిల్లా నాయకులు జి.సర్వేశ్వరరావు, బొత్స నర్సింగరావు, పి.రమణి, ఎస్.జయలక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశాయి. విజయవాడలోని దీక్షా శిబిరానికి వేలాదిమంది అంగన్వాడీలు చేరుకున్నారని, వారిపై తెల్లవారు జామున 3 గంటల కాలంలో పోలీసులు వందల సంఖ్యలో మోహరించి, కరెంటు తొలగించి, అమానుషంగా దాడి చేయడం దారుణమన్నారు. దీక్షలో ఉన్న వారిని మానవత్వం లేకుండా, మహిళలనే విచక్షణ చూపకుండా అత్యంత దారుణంగా వ్యవహరించి లాగి పడేయడం దారుణమన్నారు. అంగన్వాడీలపై పోలీసులు సాగించిన ఈ పాశవిక దాడిని, ప్రభుత్వ నిర్బంధాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు.

సిపిఐఎంఎల్ ఖండన

వీరఘట్టం: అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే మరోవైపు ప్రభుత్వం విధుల నుంచడం దారుణమని సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి పి.భాస్కరరావు ప్రభుత్వాన్ని విమర్శించారు. సోమవారం స్థానిక సిపిఐఎంఎల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చలో విజయవాడకు అంగన్వాడీ కార్యకర్తలను వెళ్లనీయకుండా పోలీసులు గృహనిర్బంధాలు, అరెస్టులు వంటివి చేయడం దారుణమన్నారు. జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్రలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలకు అన్యాయం జరిగితే ఉద్యమ కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రగతిశీల జిల్లా కార్యదర్శి దుర్గా చూడమణి, సూర్యారావు, టి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల రాస్తారోకోలు

అక్రమ అరెస్టులకు నిరసనగా రాస్తారోకో

కొమరాడ : సమస్యలు చెప్పుకొనేందుకు వెళ్తున్న అంగన్వాడీల అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా కొమరాడలో అంతర్ రాష్ట్ర రహదారిపై సోమవారం రాస్తారోకో చేపట్టారు. ఆదివారం అంగన్వాడీ సిబ్బంది, సిఐటియు నాయకులు అక్రమ అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని, అంగన్వాడీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని నాయకులు సాంబమూర్తి, అనురాధ, జ్యోతి డిమాండ్ చేశారు. కొమరాడ సిడిపిఒ సుగుణ కుమార్ సోమవారం 9.30గంట ల్లోపు విధుల్లో చేరకపోతే తొలగిస్తామని అంగన్‌వాడీ లను భయభ్రాంతులకు గురిచేయడం దారుణమ న్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటు జిల్లా స్థాయి అధికారు లు కక్ష సాధింపు చర్యలు మానుకొని అంగన్వాడీల న్యాయమైన కోర్కెలను పరిష్కరించే దిశగా ఆలోచించాలని, లేనిచో ఈ పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండలం లోని పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

43వ రోజు అంగన్వాడీల సమ్మె

సీతానగరం : అంగన్వాడీల చలో విజయవాడను విజయవంతం చేయాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 43వ రోజు అంగన్వాడీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి రెడ్డి స్వర్ణ మాట్లాడుతూ ఎక్కడా లేనివిధంగా కలెక్టర్ ప్రత్యేక ప్రకటన ద్వారా అంగన్వాడీల ఉద్యోగాల తీసేసి కొత్తవారికి అవకాశం కల్పిస్తామని ప్రచారం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి విధానాన్ని విడనాడాలని అంగన్వాడీ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొమరాడ, సాలూరులో రాస్తారోకో చేస్తున్న సిపిఎం నాయకులు, అంగన్‌వాడీలు

జిల్లాలో 7,75,598 మంది ఓటర్లు

మహిళా ఓటర్లే అధికం

ప్రజాశక్తి -పార్వతీపురం

జిల్లాలో 7,75,598 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియ చేపట్టడం జరిగింది. ఈ ప్రక్రియ ఈనెల 12తో ముగిసింది. తుది ఓటరు జాబితా ప్రచురణ ప్రతిని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో విడుదల చేశారు. ప్రత్యేక సవరణ ప్రక్రియ అనంతరం జిల్లాలో 1031 పోలింగ్ కేంద్రాల్లో తుది ఓటర్ల జాబితాలో 3,78,764 మంది పురుషులు, 3,96,766 మంది స్త్రీలు, 68 మంది థర్డ్ జెండర్ వెరసి ఓటర్లు 7,75,598గా నమోదైంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేసేందుకు శాయశక్తుల కృషి చేశామన్నారు. ఇందులో పాలకొండ (ఎస్.టి) నియోజక వర్గంలో 94,328 మంది పురుషులు, 99,325 మంది మహిళలు, 14 మంది థర్డ్ జెండర్ వెరసి 1,93,667 మంది ఓటర్లు ఉన్నారు. కురుపాం (ఎస్.టి) నియోజక వర్గంలో 93,592 మంది పురుషులు, 99,005 మంది మహిళలు, 39 మంది థర్డ్ జెండర్ వెరసి 1,92,636 మంది ఓటర్లు, పార్వతీపురం (ఎస్.సి) నియోజక వర్గంలో 92,655 మంది పురుషులు, 95,188 మంది మహిళలు, 11మంది థర్డ్ జెండర్ వెరసి 1,87,854 మంది ఓటర్లు, సాలూరు (ఎస్.టి) నియోజక వర్గంలో 98,189 మంది పురుషులు, 1,03,248 మంది మహిళలు, 4 థర్డ్ జెండర్ వెరసి 2,01,441 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. ఇదిలా ఉండగా జిల్లాలో 1316 మంది ఓటర్లు మృతి చెందినట్లు, 382 మంది శాశ్వతంగా వలసలు వెళ్లినట్లు, 358 మంది ఎక్కువ సార్లు ఓటరుగా నమోదైనట్లు గుర్తించామని వివరించారు. 2,314 ఫిర్యాదులందక ముందుగానే విచారణ చేసి తొలగించామని ఆయన చెప్పారు. 16,255 మంది తమ చిరునామాలోనే ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ఫారం 6,7,8 దరఖాస్తులను నామినేషన్ల చివరి తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. తుది ఓటరు జాబితా అన్ని పోలింగ్ కేంద్రాలు, సహాయ ఓటరు నమోదు, ఓటరు నమోదు అధికార్లు, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విచారణ నిమిత్తం అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు ఫోటోలతో కూడిన ఓటరు జాబితా ఒకటి, ఫోటోలు లేకుండా ఉన్న ఓటరు జాబితా ఒకటి ఉచితంగా అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. సమావేశంలో డిఆర్‌ఒ జె.వెంకటరావు, పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జెకెసికి 140 ఫిర్యాదులు

ప్రజాశక్తి -పార్వతీపురం

జగనన్నకు చెబుదాం (జెకేసి) కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో వినతులు వెల్లువెత్తాయి. 140మంది తమ సమస్యలపై అధికారులకు వినతులు సమర్పించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టరు నిశాంత్ కుమార్ నేతృత్వంలో జాయింట్ కలెక్టరు ఆర్.గోవిందరావు, ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, డిఆర్‌ఒ జె.వెంకటరావు, కెఆర్‌సిఎస్‌డిసి జి.కేశవనాయుడు ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. పెట్టుకునే అర్జీలకు వారు సంతృప్తి చెందేలా సరైన పరిష్కారం చూపాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం సీతానగరం మండలం అప్పయ్యపేటకు చెందిన రెడ్డి విజయ్‌కుమార్‌కు రూ.10వేలు విలువ చేసే ట్రైసైకిల్‌ను, కొమరాడకు చెందిన దత్తి పకీరునాయుడుకు రూ.10వేలు విలువ చేసే ట్రై సైకిళ్లను, జియమ్మవలస మండలం చినతుంబలికి చెందిన అమిటి పకీర్ నాయుడుకు ట్రై సైకిల్‌ను జాయింట్ కలెక్టరు ఆర్. గోవిందరావు అందజేశారు. ఈ సమావేశంలో అన్నిశాఖ జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో జవసత్వాలు

- నేడు పిసిసి అధ్యక్షులు షర్మిల రాక
- వైసిపిలో గుబులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో పార్టీలో జవసత్వాలు నింపేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. అందులో భాగంగానే ఎన్నికల సన్నద్ధత కోసం పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల మంగళవారం జిల్లాకు రానున్నారు. మధ్యాహ్నం 3గంటలకు విజయనగరంలోని క్షత్రియ కల్యాణమండపంలో పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశం కానున్నారు. పార్టీ కేడర్‌ను ఎన్నికలకు సన్నద్ధం చేయనున్నారు. ప్రస్తుత అధికారంలోకి ఉన్న వైసిపిలో నాటి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలే 99శాతం మంది ఉన్నారు. ఈనేపథ్యంలో పార్టీలో అసంతృప్తి, వ్యతిరేకత ఉన్నవారిని కాంగ్రెస్‌లోకి లాగేందుకు యత్నిస్తున్నట్టుగా తెలుస్తోంది. షర్మిల రోజుకు మూడు జిల్లాల చొప్పున పర్యటించేందుకు షెడ్యూలు ప్రకటించిన సంగతి తెలిసిందే. శ్రీకాకుళం నుంచి ఈ పర్యటనకు శ్రీకారం చుట్టారు. ఈ సమావేశంలో నాయకులకు ఆమె దిశా నిర్దేశం చేయనున్నారు. ఆమె తొలి పర్యటన ముగిశాక జిల్లా నుంచి కొన్ని చేరికలు ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా వైసిపిలో టిక్కెట్ ఆశించి, భంగపడినవారు కాంగ్రెస్ తరపున పోటీ చేసేందుకు సిద్ధపడవచ్చనే భావన చాలా మంది నోట వినిపిస్తోంది. ఒక వేళ కాంగ్రెస్ బలపడితే ఆ ప్రభావం టిడిపి, జనసేన పార్టీలకన్నా వైసిపిపైనే ప్రభావం ఎక్కువగా ఉంటుందని పలువురు అంచనా వేస్తున్నారు. ఎన్నికల్లో వైసిపి ఓట్లు ఎంతమేర చీలినా, ఆ మేరకు వైసిపికే నష్టం జరుగుతుందని కూడా చర్చనడుస్తోంది. ఈ నేపథ్యంలో షర్మిల పర్యటన జిల్లాలో ఆసక్తికర పరిణామంగా మారింది.

షర్మిల పర్యటనను జయప్రదంచేయండి

విజయనగరం కోట : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలుగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ షర్మిల తొలిసారిగా మంగళవారం జిల్లాకు రానున్నారని పార్టీ జిల్లా అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్షత్రియ కళ్యాణ మండపంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో జరిగే సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. రానున్న కాలంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు చేపట్టనున్న కార్యాచరణను తెలియజేస్తారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డోల శ్రీనివాస్, నగర పార్టీ అధ్యక్షులు సుంకరి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో నాయకత్వ లోపం

జిల్లా కాంగ్రెస్‌లో నాయకత్వ లోపం ఉందని పలువురు నాయకులు లోలోపల మదన పడుతున్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ తీరుపై స్థానిక నాయకులు బాహాటంగా తిరుగు బాటుకు సిద్ధం అవుతున్నారు. జిల్లాలో గత కొంత కాలంగా లోలోపల పార్టీ నాయకుల మధ్య అధికారం కోసం కుమ్ములాటలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న నాయకులను ఏకతాటి పైకి తీసుకు రావడంలో అధ్యక్షుడు విఫలమయ్యారన్న చర్చ జరుగుతోంది. పదవి చేపట్టిన నాటి నుంచి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటు న్నారంటూ జిల్లా, పట్టణ నాయకులు ఆయనపై మండి పడుతున్నారు. ఎవరినీ పట్టించుకోకుండా తన నచ్చినప్పుడు సమావేశాలు పెడుతున్నారని విమర్శిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పార్టీకి ఇబ్బందని అంటున్నారు. నూతన పిసిసి అధ్యక్షులు షర్మిల రాక తోనైనా తీరుమారేనా, లేక తాను మారేనా! అంటూ నాయకులు వాపోతున్నారు.

కొరిగి, పూంసే పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం

ఈ నెల 19,20,21 తేదీల్లో రాజస్థాన్ రాష్ట్రం సవాయి మాదాపూర్‌లో జరిగిన 40వ జూనియర్, 39వ సీనియర్ (కొరిగి) జాతీయ స్థాయి పోటీల్లో మన రాష్ట్ర క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబరిచి మన రాష్ట్రానికి కొరిగి విభాగంలో 6 బంగారు పతకాలు, 5 రజత పతకాలు, 5 కాంస్య పతకాలు సాధించారు. జూనియర్ ఓవరాల్ ఛాంపియన్ షిప్ 3 వ ట్రోఫీ, సీనియర్ ఓవరాల్ ఛాంపియన్ షిప్ 1 వ ట్రోఫీ అందుకున్నారు. పూంసే విభాగంలో 6 బంగారు పతకాలు, 4 రజత పతకాలు, 8 కాంస్య పతకాలు సాధించి జూనియర్ ఓవరాల్ పూంసే ఛాంపియన్ షిప్ 2వ ట్రోఫీ అందుకున్నారు.

నేడు పోలమాంబ సిరిమానోత్సవం

- 650 మంది పోలీసులతో బందోబస్తు
- 170 ఆర్‌టిసి బస్సులు
- ఎస్‌పి పర్యవేక్షణలో పటిష్ట భద్రత

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్ర గిరిజన దేవత జాతరగా గుర్తింపు పొందిన ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శంబర పోలమాంబ అమ్మవారి సినిమానోత్సవం మంగళవారం జరగనుంది. మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభమయ్యే సినిమానోత్సవానికి ఎస్పీ విక్రాంత్ పాటిల్ పర్యవేక్షణలో సుమారు 650 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. దేవాదాయ శాఖ ఇఒ వివి సూర్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు. సిరిమానును ఈ ఏడాది పూజారి జగదీష్ అధిరోహించనున్నారు. సాలూరు, పార్వతీపురం, విజయనగరం, పాలకొండ ఆర్‌టిసి డిపోల నుంచి సుమారు 170 బస్సులు ప్రత్యేకంగా శంబరకు నడపనుంది. ఇందుకోసం వనంగుడి వద్ద సాలూరు వైపు నుండే వచ్చేబస్సులను అలాగే జిల్లా పరిషత్ హై స్కూల్ వద్ద మక్కువ వైపు నుండి వచ్చే బస్సులను నిలపనున్నారు.

నిఘా నీడలో సంబర

జాతర సందర్భంగా మంగళవారం జరగనున్న సినిమానోత్సవానికి పటిష్ట నిఘాను ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో తమ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. డ్రోన్, సీసీ కెమెరాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. అసాంఘిక శక్తులకు, అల్లర్లకు ఎలాంటి ఆస్కారం లేకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. క్రైమ్ టీం, షీ టీంలతో పాటు మఫ్టీలో మహిళా, పురుష పోలీసులు విధులు నిర్వహిస్తారన్నారు. రహదారి భద్రతపై పటిష్ట చర్యలు చేపట్టమన్నారు. మక్కువ ప్రధాన రహదారి జంక్షన్ నుంచి ట్రాఫిక్‌ను రెండు విధాలా మళ్లిస్తున్నట్టు తెలిపారు. చెముడు మీదుగా మూడు, నాలుగు చక్రాల వాహనాలకు అనుమతిస్తూ,కవిరపల్లి మీదుగా ద్విచక్ర వాహనాలకు అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. సిరిమాను ఊరేగింపు సమయంలో రోప్ పార్టీ బందోబస్తు ఉంటుందన్నారు. మూడుచోట్ల ప్రత్యేక పోలీసులను ఏర్పాటు చేశామన్నారు. అపరిచిత వ్యక్తులతో భక్తులు ఎటువంటి చనువుతో ఉండకూడదన్నారు. ఎలాంటి ఇబ్బంది కలిగినా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలన్నారు

విద్యుత్ శాఖ ఏర్పాట్లు భేష్

జాతర సందర్భంగా గ్రామంలోని అమ్మవారి ఆలయాల వద్ద ఎటువంటి ఆటంకం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరాకు ఆ శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. డిఇ వి.కిషోర్, ఎడిఎ రంగారావు ఆధ్వర్యంలో లైన్ ఇన్స్పెక్టర్ ఎ.రవికుమార్, లైన్‌మాన్లు ఎల్.శ్రీనివాసరావు, సురేష్, ఇతర సిబ్బంది రేయింబవళ్లు పనిచేస్తూ విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగకుండా ఏర్పాట్లు చేశారు. అలాగే గ్రామంలో సిరిమాను తిరిగాడే వీధుల్లో విద్యుత్ తీగలను ఏమాత్రం వదులు లేకుండా చర్యలు చేపట్టారు.

ఉత్సవానికి సిద్ధమైన సిరిమాను

విధుల్లో 120 మంది పారిశుధ్య కార్మికులు

గ్రామంలో పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులు చేపట్టేందుకు 120మంది పారిశుధ్య కార్మికులను విధుల్లోకి తీసుకుంటున్నట్లు ఇఒపిఆర్‌డి దేవకుమార్ తెలిపారు. సోమ, మంగళ, బుధవారాల్లో సేవలు వినియోగిస్తున్నామన్నారు. అలాగే అన్ని సచివాలయాల కార్యదర్శులు కూడా జాతర పనుల్లో నిమగ్నమై ఉన్నారన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా స్వచ్ఛ శంబర పాటిస్తామని ఆయన తెలిపారు.

పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ; దర్శనానికి ఏర్పాటుచేసిన క్యూలైన్లు

ప్రజాశక్తి
www.prajasakti.com

నేటి 'శంఖారావం'లో పాల్గొనాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

కురుపాం నియోజకవర్గం నాయకులకు, రాష్ట్ర టిడిపి నాయకులకు, జిల్లా స్థాయి నాయకులకు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులకు, క్లస్టర్ ఇంచార్జ్ లకు, యూనిట్ ఇన్చార్జులకు, బూత్‌ఇన్చార్జులకు, గ్రామ పార్టీ అధ్యక్షులకు, టిడిపి నాయకులకు, కార్యకర్తలకు మండలంలో రావివలసలో జరిగే సభకు తప్పక టిడిపి శ్రేణులు పాల్గొనాలని కోట భరత్ (సుమన్), అరకు పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు తెలిపారు. ఈ సభలో ప్రధానంగా బిసి సాధికారిత గురించి వివరించారు. అలాగే టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలు కూడా ఘనంగా నిర్వహించారు. కావున కురుపాం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కేడర్ అంతా పాల్గొని ఈ పార్టీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కులగణన చేపడుతున్న సిబ్బంది

కురుపాంలో కులగణన

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మేజర్ పంచాయతీ కురుపాంలో గల శోభలతాదేవి కాలనీలో సోమవారం సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఇంటి ఇంటికీ వెళ్లి కులగణన నిర్వహించారు. కుటుంబం ఆర్థిక, సామాజిక స్థితిగతులు, కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తూ యాప్‌లో అప్లోడ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కుల గణన ద్వారా ప్రజల స్థితిగతులు, కులాలు, విద్యాభివృద్ధి, ఉపాధి అభివృద్ధి ఎంతవరకు పొందారో తెలుసుకుని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి కుల గణన దోహదపడుతుందని తెలిపారు. తరచూ సర్వర్ డౌన్ అవుతున్న కారణంగా వివరాలు నమోదు నెమ్మదిగా సాగుతుందన్నారు.

సిబ్బందికి సూచనలు చేస్తున్న జడ్జి రమేష్

సిహెచ్‌సి సందర్శన

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కురుపాం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎ.రమేష్ సోమవారం అకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణికి ఆస్పత్రిలో రోగులకు సరిపడే మందులు, బ్లడ్లు, పాము కాటు ఇంజక్షన్లు గూర్చి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పారిశుద్ధ కార్మికులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో బ్లడ్లను, గదులను అలాగే ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో పరిశు భ్రంగా ఉంచేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో న్యాయవాదులు వాసుదేవరావు, కె. అశోక్, మండల్ లీగల్ సెల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని జాతీయ మానవ హక్కుల కమిటీ, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావును కలిసి మున్సిపాలిటీని వేధిస్తున్న దోమల సమస్యపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని కొన్ని వార్డుల్లో ఉన్న కాలువల్లో గత కొంతకాలంగా పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో దోమలు విపరీతంగా పెరిగాయని, దీంతో ప్రజలు దోమల బాధలు అనుభవిస్తున్నారన్నారని అన్నారు. అలాగే గత కొంతకాలంగా దోమల నివారణకు ఫాగింగ్, క్రిమిసంహారక మందులు పిచికారి తదితర కార్యక్రమాలు జరగడం లేదని అన్నారు. దోమల నివారణకు తక్షణ చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. దీనికి జెసి స్పందిస్తూ మున్సిపాలిటీలో దోమల నివారణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ కార్యాలయ మేనేజర్ దిబ్బా రూబేను ఆదేశించారు.

శత్రుచర్లను కలిసిన వీరేష్, ప్రదీప్ దేవ్

ప్రజాశక్తి - కురుపాం

శత్రుచర్లతో వీరేష్, ప్రదీప్‌దేవ్

టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్, తన తండ్రి, మాజీ ఎంపి ప్రదీప్‌దేవ్ సోమవారం చినమేరంగి కోట వద్దకు వెళ్లి మాజీ మంత్రి శత్రుచర్ల విజయ రామరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా నియమితమైన సందర్భంగా మర్యాదపూర్వక కలవడం జరిగింది. అలాగే నియోజకవర్గ కేంద్రమైన కురుపాం టిడిపి కార్యాలయంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆ కార్యక్రమానికి ఆయనకు ఆహ్వానించడం జరిగిందని తెలిపారు.

ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఎడి నిర్మల జ్యోతి

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- బలిజిపేట

మండలంలోని ఎరువుల దుకాణాలను పార్వతీపురం వ్యవసాయక సహాయక సంచాలకులు ఏ నిర్మల జ్యోతి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో ఉన్న రికార్డులను, నిల్వ ఎరువులను పరిశీలించి, నాణ్యత, ధర, బరువులపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా దుకాణాలలో అమ్మకాలు జరపాలని లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఒ శ్రావణ్ కుమార్, దుకాణ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

సీతంపేట: గిరిజనుల సమస్యల పరిష్కరించాలని పలువురు గిరిజనులు స్పందనలో వినతులు సమర్పించారు. సోమవారం స్పందన పిఒ కల్పనకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. నవ గోడకు చెందిన నిరంజన్ ఉన్నత చదువులు కోసం ఆర్థిక సహాయం అందించాలని వినతి సమర్పించారు. బర్న గూడకు చెందిన మీన ఇల్లు మంజూరు చేయాలని, గదభ పేటకు చెందిన సింహాచలం అంత్యోదయ కార్డు మంజూరు చేయాలని, కర్ర గూడకి చెందిన గోపాల్ కుట్టు మిషన్ మంజూరు చేయాలని, గూనబద్ధకు చెందిన వెంకటరావు కొండ పట్టా మంజూరు చేయాలని, తిరుపతికి చెందిన మాధవరం అంగన్వాడి ఆయా పోస్టు ఇప్పించాలని, చిన్నసలియాకు చెందిన సీమ తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతులు ఇచ్చారు. ఈ స్పందన కార్యక్రమంలో ఎపిఒ రోసి రెడ్డి, ఇఇ సింహాచలం, డిడి అన్నదొర, సిడిపిఒ రంగుల లక్ష్మి, పిహెచ్‌ఒ గణేష్, పిఎఒ హరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీకా కార్యక్రమం బలోపేతం చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురం

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

టీకా కార్యక్రమాన్ని బలోపేతం చేసే దిశగా శిక్షణ కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు అన్నారు. స్థానిక ఎన్‌జిఒ సమావేశ భవనంలో వైద్యాధికారులకు సోమవారం టీకా కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. వైజాగ్ జోన్ నుండి డబ్ల్యుహెచ్‌ఒ బృందం పవర్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో డాక్టర్ జగన్నాథరావు పాల్గొని పలు సూచనలు చేశారు. టీకా కార్యక్రమానికి సంబంధించి వైద్యారోగ్యశాఖ సూచిస్తున్న మార్గదర్శకాలను కచ్చితంగా పాటించి, క్షేత్ర స్థాయిలో అమలు జరిగేలా చూడాలన్నారు. వ్యాక్సిన్ నివారిత వ్యాధుల (విపిడి) నియంత్రణకు ప్రభుత్వం పటిష్టంగా కృషి చేస్తుందన్నారు. ముఖ్యంగా తట్టు, రుబెల్లా వ్యాధుల ప్రబలకుండా శతశాతం వ్యాక్సినేషన్ జరగాలన్నారు. ఒపి నిర్వహణలో దద్దుర్లతో కూడిన జ్వరం, ఎఎఫ్‌పి సమస్యలతో ఉన్న వారిని గుర్తిస్తే వెంటనే సంబంధిత పోర్టల్‌లో నమోదు చేసి జిల్లా ఆరోగ్య కార్యాలయం దృష్టికి తీసుకురావాలని ఆయన ఆదేశించారు. ఇచ్చిన ఫార్మాట్‌లో వారి వివరాలు నమోదు చేసి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కి పంపించాలని చెప్పారు. వ్యాక్సిన్ నిల్వలను ఎప్పటి కప్పుడు పరిశీలించాలని, ఐఎల్ఆర్‌లో నిర్దేశించిన ఉష్ణోగ్రతలు ఉండాలని, టీకా వయల్స్ యొక్క వివిఎమ్ విధిగా చేయాలని ఆదేశించారు. పిల్లలకు షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయాలని, డ్రాప్ ఔట్స్, లెఫ్ట్ అవుట్స్ గుర్తించాలని ఆయన పేర్కొన్నారు. టీకా మార్గదర్శకాలు పాటించి యువిన్ పోర్టల్‌లో ఆన్‌లైన్ నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఐఒ డాక్టర్ నారాయణరావు, డిఎంఒ డాక్టర్ టి. జగన్మోహనరావు, డిఎల్‌ఎటిఒ డాక్టర్ శ్యామ్ కుమార్, డబ్ల్యుహెచ్‌ఒ ఎస్‌ఎంఒ డాక్టర్ జాన్ జూడ్ జాషువా, జయగౌడ్, పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ పూర్తి చేయాలి

పార్వతీపురంరూరల్: ఆరోగ్యశ్రీ కార్డులను అర్హులందరికీ వెంటనే పంపిణీ పూర్తి చేయాలని జెఎఎస్ జిల్లా పర్యవేక్షణాధికారి, రాష్ట్ర టిబి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్ ఆదేశించారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు ఆధ్వర్యంలో ప్రోగ్రాం అధికారులకు సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో డాక్టర్ టి.రమేష్ పలు సూచనలు చేశారు. మండలాలు, సచివాలయాల వారీగా ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ నివేదికలను ఆయన పరిశీలించి, ఎక్కువగా పెండింగ్ ఉన్న ప్రాంతాల్లో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. ఈ మేరకు ఆయా పరిధిలో పర్యవేక్షణ చేయాలని ప్రోగ్రాం అధికారులను ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్షలో గుర్తించిన రిఫరల్స్‌కు వెంటనే సంబంధిత ఆసుపత్రుల్లో చికిత్స పూర్తి అయ్యేలా తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అందుకు అవసరమైన రవాణా ఖర్చులను ప్రభుత్వం ఇస్తుందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జెఎఎస్-2 ప్రోగ్రాం పకడ్బందీగా నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేలా చూడాలన్నారు. సమావేశంలో సీతంపేట, పార్వతీపురం డిప్యూటీ డిఎంహెచ్ఒలు డాక్టర్ విజయపార్వతి, డాక్టర్ శివకుమార్, డిఎంఒ డాక్టర్ టి.జగన్మోహనరావు, డిఎల్‌ఎటిఒ డాక్టర్ శ్యామ్‌కుమార్, ఎఫ్డిపి నోడల్ అధికారి డాక్టర్ వినోద్ కుమార్, పిఒ డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

సిఐగా రవికుమార్

పార్వతీపురం రూరల్: పార్వతీపురం రూరల్ సిఐగా కె.రవికుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ సిఐగా పని చేసిన స్వామి నాయుడు స్థానంలో రాజాం టౌన్ సిఐగా పనిచేసిన రవికుమార్ వచ్చి చేరడంతో పార్వతీ పురం రూరల్, సీతానగరం, బలిజిపేట ఎస్ఐలు దినకర్, రాజేష్, పాపారావు, అభినందనలు తెలియజేశారు.

ప్రాథమిక చికిత్సే కీలకం

పార్వతీపురంరూరల్: మనిషి వ్యాధి బారిన పడి ప్రాణం నిలబెట్టడంలో ప్రాథమిక చికిత్స చాలా కీలకమని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి. జగన్మోహన్‌రావు అన్నారు. స్థానిక గిరిజన సామాజిక భవనంలో జెవివి, పీపుల్స్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ప్రాథమిక చికిత్స' అవగాహన, శిక్షణా తరగతులను డాక్టర్ జగన్మోహన్‌రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పలు వ్యాధుల గుర్తింపు నివారణ, ప్రాథమిక చికిత్స తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షులు ఎం.రత్నకుమార్, కార్యదర్శి డి.చంద్ర మౌళి, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.రంజిత్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు కె.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లోనే ఉపాధి కల్పన శాఖ సేవలు

ప్రజాశక్తి -పార్వతీపురం

ఉపాధి కల్పన శాఖలో ఆన్ లైన్ సేవలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉపాధి కల్పన శాఖ రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సోమవారం విడుదల చేశారు. ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్, అదనపు అర్హతల నమోదు తదితర అంశాలను ఉపాధి కల్పన శాఖ ఆన్ లైన్ సేవల ద్వారా చేసుకోవచ్చని ఆయన చెప్పారు. ఈ సేవలను జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, మోడల్ కెరీర్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు, మొబైల్ ద్వారా పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. సేవలు employment.ap.gov.in వెబ్‌సైట్‌లో అభ్యర్థులు లాగిన్ అవుతూ పొందవచ్చని చెప్పారు. లాగిన్ అయిన వారికి ఎస్ఎంఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ నెంబరు వస్తుందన్నారు. అభ్యర్థి వివరాలు నమోదు అనంతరం జిల్లా ఉపాధి కల్పన అధికారి ఆమోదించాలని, అప్పుడు ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ నెంబరు ఎస్ఎంఎస్ ద్వారా వస్తుందని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ఎంప్లాయిమెంట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, మోడల్ కెరీర్ సెంటర్ల సేవలను భారత ప్రభుత్వ నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సిఎస్) పోర్టల్‌తో ఆన్‌లైన్‌లో అనుసంధానించడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకట రావు, కెఆర్ఆర్‌సి ఎస్డిసి జి.కేశవనాయుడు, జిల్లా ఉపాధి కల్పన అధికారి ఆర్ వహీదా తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

ఆదివాసీ నాయకుల గృహ నిర్బంధం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పోలీసుల అదుపులో ఆదివాసీ నాయకుడు

అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా పోరాటాలను అడ్డుకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్ హెచ్చరించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా విజయవాడకు తరలి వెళుతున్న అంగన్వాడీలకు సంఘీభావంగా పోరాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులైన కోలక అవినాష్, మండంగి రమణను ఎల్విన్‌పేట పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ విజయవాడకు తరలి వెళ్తున్న ఆదివాసీ నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకొని గృహనిర్బంధాలు చేయడం ప్రభుత్వ దుర్మార్గపు చర్యకు నిదర్శనమన్నారు. ప్రభుత్వ అంగన్వాడీల సమస్యలను పరిష్కరించ కుండా బెదిరింపు చర్యలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. అంగన్వాడీల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించుకుంటే భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీల పోరాటాలకు ప్రజలు మద్దతు తెలపాలని కోరారు.

పోలీసుల అదుపులో సిఐటియు జిల్లా అధ్యక్షులు

పాలకొండ : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెలో భాగంగా చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునివ్వడంతో సోమవారం ఉదయం విజయవాడ వెళ్లడానికి స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఉన్న సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావును పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

ఎస్‌కెపాడు పార్కు పనులు పూర్తిచేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్ పేట పంచాయతీ సవరకోటపాడు ఉద్యానవన సుందరీకరణ పనులు పూర్తి చేయాలని పార్వతీపురం ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ ఆదేశించారు. తన పర్యటనలో భాగంగా సోమవారం ఎస్‌కె పాడు ఉద్యాన నర్సరీలో చేపడుతున్న పర్యాటక సుందరీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు చేపట్టడంలో జాప్యం చేయరాదని స్పష్టం చేశారు. పర్యాటక నిలయాలుగా ఈ ప్రాంతం మారాలని, ఇక్కడ ప్రకృతి రమణీయతలు, వాగులు, జలపాతాలు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తాయని అన్నారు. ఒకసారి పర్యాటకులు సందర్శిస్తే మరపురాని అనుభూతి కలుగుతుందన్నారు. పార్కు మౌళిక సదుపాయాల కల్పనలో భాగంగా కొనుగోలు చేసిన సామాగ్రిని ప్రాజెక్టు అధికారి తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారి జె శాంతీశ్వర రావు, భద్రగిరి ఇంజినీరింగ్ డిఇ సింహాచలం, ఎఇలు తదితరులు పాల్గొన్నారు.

పార్కు పనులను పరిశీలిస్తున్న పిఒ విష్ణుచరణ్

ప్రకృతి పంటలతో అధిక ఆదాయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రైతులతో మాట్లాడుతున్న ఎఒ ప్రసాదరావు

తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే ప్రకృతి వ్యవసాయ పంటలపై గిరిజన రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి సిహెచ్ ప్రసాదరావు కోరారు. లక్కగూడలో గిరిజనులు పండిస్తున్న ప్రకృతి వ్యవసాయ పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ఆదాయం వచ్చే పంటలపై రైతులు దృష్టి సారించి ప్రతి రైతు తనకున్న భూమిలో ఏదో ఒక మోడల్ వేసుకొని మంచి దిగుబడులు సాధించాలన్నారు. తక్కువ ఖర్చుతో ఏకపంట విధానం వేయకుండా ఐదు నుండి 20 రకాల పలు పంటల విధానం వేసుకొని 365 రోజులు కూడా పంటలు వేస్తూ భూమిని కప్పిబడి ఉంచాలన్నారు. మండలంలో ప్రతి గ్రామంలో ఎక్కువ శాతం ప్రకృతి వ్యవసాయం కొనసాగించాలన్నారు. ఇప్పుడు రబీకి 5 నుండి 20 రకాలు ఆర్‌డిఎస్ పంటలు వేసుకోవాలన్నారు. ఏక పంట విధానం పూర్తిగా మార్చుకోవాలన్నారు. మినుములు, పెసలు పంపిణీ చేశారు. ఎటిఎం మోడల్‌లో ద్రవ జీవం తయారు చేశారు. ప్రకృతి పంటలతో ఆరోగ్యం కాపాడుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ కె అర్జున్‌రావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గణేష్, చంద్ర, కె భూషణ్, బి దశలు, దీప, నవ్య పాల్గొన్నారు.

అందరి సహకారంతో పంచాయతీల అభివృద్ధి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గ్రామ పంచాయతీల అభివృద్ధికి వార్డు సభ్యుల సహకారం, అదేవిధంగా ప్రణాళికలు తయారీ విజయవంతంగా పూర్తికావాలంటే అందరి భాగస్వామ్యం అవసరమని ఎంపిడిఒ జి.పైడితల్లి అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామాభివృద్ధి ప్రణాళికలు తయారీపై 2024- 25కు సంబంధించి గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు విఒఎలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామపంచాయతీల అభివృద్ధికి ఖచ్చితమైన ప్రణాళికలు అవసరమని పేర్కొన్నారు. వాటిని తయారు చేసేందుకు అందరి భాగస్వామ్యం అవసరం ఎంతైనా ఉందన్నారు. ముందస్తు ప్రణాళికలతో అభివృద్ధి పనులు చేయవచ్చని తెలిపారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంచాయతీల అభివృద్ధికి ఇటువంటి శిక్షణలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో కార్యాలయ ఎఒ అర్జునరావు, ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, ఎంఇఒ నగిరెడ్డి నాగభూషణరావు, ఎపిఒ మండల గౌరీనాథ్, సిసి చందాన తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ పైడితల్లి

ఎస్ఎస్‌ఒఎస్ఇఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ - జెఎసి సమావేశం ప్రజా సంఘాల కార్యాలయంలో ఆర్ శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం జరిగింది. జెఎసి జిల్లా సమావేశానికి పర్యవేక్షకులుగా రాష్ట్ర అధ్యక్షులు బి. కాంతారావు (నాని) జిల్లా గౌరవ అధ్యక్షులు జి అప్పలసూరి హాజరయ్యారు. 22 రోజుల సమ్మె, అనుభవాలు, లోపాలు, భవిష్యత్తు కార్యాచరణ గురించి చర్చించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మన ఐక్యతను కొనసాగిస్తూ రాష్ట్ర జెఎసి నాయకత్వానికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ఐక్యతను మరోసారి చాటి చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చర్యలు తీసుకోవాలని, జీతాలు పెంపు జీవో విడుదల చేయాలని కోరుతూ తీర్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కె.గురువులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.రవీంద్రబాబు, ఉపాధ్యక్షులుగా పి.తేజేశ్వరి, ఎన్.పద్మ, పి.రాంబాబు, డి.జయగణేశ్, ప్రధాన కార్యదర్శిగా రమాదేవి, అడిషనల్ జనరల్ సెక్రటరీగా ఆర్ శ్రీనివాసరావు, జాయింట్ కార్యదర్శులుగా డి. నరసింహం, బి.నారాయణమూర్తి, టి.చిన్నతల్లి, వంశీకృష్ణ, ఎం.రాజు, కోశాధికారి (ట్రెజరర్)గా వి.సింహాచలం ఎన్నికయ్యారు.

జిల్లా నూతన కమిటీ సభ్యులు

రాజకీయ పార్టీలతో సమావేశం

ప్రజాశక్తి - సీతంపేట

ఓటర్ల జాబితాపై వివిధ రాజకీయ పార్టీలతో సోమవారం ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఓటర్ల జాబితాను పూర్తి పారదర్శకంగా తయారు చేశామని, అన్ని తప్పులను సరిద్దిద్దామని అన్నారు. ఎక్కువ సంఖ్యలో కొత్త ఓటర్లను నమోదు చేయించామని అన్నారు. నేడు విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాలో ఇంకా ఏమైనా తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, డీటీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న పిఒ కల్పనా

వ్యవహారిక భాషకు ఆద్యుడు గిడుగు

సాలూరు: తెలుగులో గ్రాంధికం వాడుకలో వున్న సమయంలో వ్యవహారిక భాషని వినియోగంలోకి తెచ్చిన మహనీయుడు గిడుగు రామమూర్తి పంతులు అని శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కోడూరు సాయి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం గిడుగు రామమూర్తి పంతులు వర్ధంతి సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామ్మూర్తి పంతులు తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమాన్ని ఉధృతం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.లక్ష్మీ, అకడమిక్ డైరెక్టర్ మల్లేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సాయి శ్రీనివాసరావు

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక పోస్టాఫీసు రోడ్డు ప్రాంతంలో అంపిలికి చెందిన వారణాసి మణికంఠ 40మద్యం సీసాలతో సోమవారం పోలీసులకు పట్టుబడ్డాడు. ప్రభుత్వ మద్యం దుకాణాల నుండి మద్యం సీసాలు కొనుగోలు చేసి అంపిలిలో విక్రయించడానికి వెళుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఎస్ఐ ప్రశాంత్ కుమార్ కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు చెప్పారు.

జిఒ 3 రద్దుకు చంద్రబాబే కారణం : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

ఏజెన్సీలో గిరిజనులకు నూరుశాతం ఉద్యోగాల భర్తీకి సంబంధించిన జీవో 3 రద్దు కావడానికి అప్పటి చంద్రబాబు ప్రభుత్వమే కారణమని డిప్యూటీ సిఎం రాజన్నదొర ఆరోపించారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల అరుకులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు జిఒ 3పై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2020లో జీవో 3ను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. అప్పుడు అధికారంలో ఉన్నది టిడిపి ప్రభుత్వమేనని చెప్పారు. జిఒ 3 పై టిడిపి ప్రభుత్వం సుప్రీంకోర్టులో సరైన వాదన వినిపించని కారణంగానే కోర్టు తీర్పు వ్యతిరేకంగా వచ్చిందని చెప్పారు. వైసిపి హయాంలో జీవో 3ను రద్దు చేస్తూ తీర్పు వెలువడిందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేసిందని చెప్పారు. ఆరోజు చంద్రబాబు నాయుడు సమర్థుడైన న్యాయవాదితో ప్రభుత్వ వాదనను వినిపించి ఉంటే జీవో 3 రద్దయ్యేది కాదన్నారు. గిరిజనులంటే వివక్ష, చులకన భావం వల్లనే చంద్రబాబు నాయుడు ఆరోజు నిర్లక్ష్యం చేశారని, ఇప్పుడు కపట ప్రేమ నటిస్తూ మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. 1997లో అరుకు, పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాలకు అనుమతి ఇస్తూ చంద్రబాబు నాయుడు జీవో జారీ చేశారని గుర్తు చేశారు. జిఒ 3ని పునరుద్ధరిస్తూ రాష్ట్ర గవర్నర్ ఆర్డినెన్సుతో చట్టం చేయాలని ప్రభుత్వం ఒకదశలో భావించిందని చెప్పారు. అయితే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వుండగా ఆర్డినెన్సు తీసుకురావడం కోర్టు ధిక్కారం అవుతుందని రాష్ట్ర ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ సలహా ఇచ్చినట్లు తెలిపారు. ఏజెన్సీలో గిరిశిఖర గ్రామాలకు రోడ్ల నిర్మాణానికి 14 ఏళ్లు పాలించిన చంద్రబాబు నాయుడు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. గడచిన ఐదేళ్లలో రూ.1100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టానని చెప్పారు. బోయ, వాల్మీకి లను ఎస్టీల్లో చేర్చింది చంద్రబాబు నాయుడేనని చెప్పారు. లక్ష కోట్ల రూపాయల అవినీతి కుంభకోణాలకు టిడిపి పాల్పడిందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ గతంలో ఆరోపణలు చేశారని, ఇప్పుడు అలాంటి పార్టీతో పొత్తు ఎలా పెట్టుకున్నారని ప్రశ్నించారు.

ఆరోపణలు నిరూపిస్తే అక్రమాస్తులు రాసిస్తా

తనపై మాజీ సిఎం చంద్రబాబు నాయుడు చేసిన అక్రమాస్తుల ఆరోపణలు నిరూపిస్తే తాను ఆ ఆస్తులను ఆయనకు గానీ, ఆయన పార్టీకి గాని రాసి ఇచ్చేస్తానని చెప్పారు. తాను అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు చంద్రబాబు నాయుడు ఇటీవల అరుకు పర్యటనలో ఆరోపించడంపై రాజన్నదొర భగ్గుమన్నారు. ఆయన రెండు ఎకరాల భూమి నుంచి రెండు లక్షల కోట్లకు ఎలా ఎదిగారో చెప్పాలని డిమాండ్ చేశారు. తనపై చేసిన ఆరోపణలకు సంబంధించి చంద్రబాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు వేయడానికి న్యాయవాదులతో సంప్రదిస్తున్నానని చెప్పారు.

చంద్రబాబు ఉచ్చులో షర్మిల పడొద్దు

వైఎస్సార్ కుమార్తెగా షర్మిలను గౌరవిస్తానని ఆయన చెప్పారు. తెలంగాణా కోడలునని చెప్పి అక్కడ పార్టీ పెట్టిన షర్మిల ఇప్పుడు ఎపి కాంగ్రెసులో చేరి ఆడపడుచునని చెపుతున్నారన్నారు. వైఎస్సార్ ఆశయాల దిశగా ప్రభుత్వం ఇప్పటికే అడుగులు వేస్తుందని కొత్తగా ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరి వైఎస్సార్ ఆశయ సాధన కోసమని చెప్పడం తగదన్నారు.

శ్మశాన వాటిక నిర్మాణానికి తొలుత నిధులు ఇచ్చింది నేనే

పట్టణంలో స్వర్గధామం నిర్మాణానికి మొదటి సారి నిధులు మంజూరు చేసింది తానేనని రాజన్నదొర చెప్పారు. కాంగ్రెస్ హయాంలో తన ఎమ్మెల్యే నిధి నుంచి, ఎంపి కిశోర్ చంద్రదేవ్ నిధుల నుంచి మంజూరు చేసినట్లు తెలిపారు. ఇటీవల కాలంలో శ్మశాన వాటిక నిర్మాణానికి నిధులు కావాలని తనని ఎవరూ సంప్రదించలేదని చెప్పారు. ఒకవేళ సంప్రదించి వుంటే అరుకు ఎంపీ నిధులు మంజూరు చేయించేవాడినని అన్నారు. తనను అడగకుండా పట్టించుకోలేదని ఆరోపణలు చేయడం తగదన్నారు. ఎన్నికల ముందు తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని రాజన్నదొర హెచ్చరించారు.

చెట్టుకు ఉరేసుకుని ఎండియు ఆపరేటర్ మృతి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గుమ్మ పంచాయతీ గుమ్మగదవలస గ్రామంలో చెట్టుకు ఉరి వేసుకుని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, బంధువులు అందించిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన సీమల నూకయ్య (37) ఎండియు ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అయితే అందరితో కలివిడిగా ఉండే నూకయ్య చెట్టుకు ఉరేసుకుని ఎందుకు చనిపోయాడో తెలియడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. కాగా సేల్స్ మ్యాన్, అధికారుల ఒత్తిడి కారణంగానే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని భార్య జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతునికి ఇద్దరు పిల్లలున్నారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యచేసుకున్న నూకయ్య